క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

లింగాల: మండలంలోని దారారం గ్రామానికి చెందిన సంఘం కిష్టయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అచ్చంపేట నియోజక వర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రాథోడ్ గురువారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఎమ్మెల్యే వంశీకృష్ణ సూచన మేరకు రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

వెల్దండ: మండల కేంద్రానికి చెందిన బైక్ మెకానిక్ పాండు అనారోగ్యంతో మృతి చెందాడు. మండల బైక్ మెకానిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.12 వేల ఆర్థికసాయం అందజేశారు. మెకానిక్‌లు యాదయ్యగౌడు, గణేష్‌ముదిరాజ్, దేవేందర్ రెడ్డి, మహేష్‌యాదవ్, సురేష్, మహేష్‌గౌడు, తదితరులు ఉన్నారు.

రైతులు విత్తనశుద్ధి పాటించాలి

పెద్దకొత్తపల్లి: వానాకాలం సాగు చేస్తున్న మొక్కజొన్న తదితర పంటలకు విత్తనశుద్ధి చేపట్టాలని ఏఈఓ ముజీబ్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం రైతు రాజవర్ధన్‌రెడ్డి వ్యవసాయ పొలం వద్ద మొక్కజొన్న విత్తనాలు వేస్తున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈఓ మాట్లాడుతూ విత్తనాలు వేసే టప్పుడు వేరుపురుగు, కుళ్లపురుగు ఆశించకుండా రైజోబియ్యం మందులు విత్తనాలకు పట్టించి పొలంలో వేసుకుంటే మొక్కలకు ఎలాంటి చీడపీడలు ఆశించవని ఆయన సూచించారు. మొక్కమొక్కకు 2 మీటర్ల దూరం ఉండేలా విత్తుకోవాలని వివరించారు.

సీఎంను కలిసిన కేతూరి వెంకటేష్



కొల్లాపూర్: నియోజకవర్గానికి చెందిన బీసీ నాయకుడు, ఏఐసీసీ ఓబీసీ సెల్ జాతీయ కోఆర్డినేటర్ డాక్టర్ కేతూరి వెంకటేష్ గురువారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. పార్టీకోసం 23 ఏళ్లుగా కష్టపడుతున్నానని తనకు కార్పొరేషన్ చైర్మన్‌గా అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఉస్మానియ విద్యార్థి నాయకుడిగా తెలంగాణ పోరాటం, విద్యారంగ సమస్యలపై చేపట్టిన ఉద్యమాలు, భారత్ జోడో యాత్రలో పాల్గొన్న వివరాలను సీఎంకు వివరించారు.

కల్వకుర్తిరూరల్: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా గురువారం బాధ్యతలు స్వీకరించిన కేంద్ర మంత్రి బండిసంజయ్‌ను ఢిల్లీలోని కేంద్రమంత్రి కార్యాలయంలో కల్వకుర్తి జెడ్పీటీసీ, నాగర్‌కర్నూల్ ఎంపీగా బీజేపీ నుంచి పోటీ చేసిన భరత్‌ప్రసాద్‌లు కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. గౌతమ బుద్ధుడి ప్రతిమను అందజేశారు.

పాఠశాలకు బెల్ వితరణ

కోడేరు: మండలంలోని రేకులపల్లితండా ప్రాథమిక పాఠశాలకు ఎస్‌డబ్ల్యూఎస్‌ఏ సంస్థ అధ్యక్షుడు సురేష్‌నాయక్, తల్లి కేతావత్ లక్ష్మీబాయి బెల్‌ను ఉచితంగా అందచేశారు. ఉపాధ్యాయులు నరేష్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కోరారు. అనంతరం వారిని అభినందించారు.

ఆర్‌ఓఆర్ ప్లాంట్..

అమ్రాబాద్: పదర మండలం చిట్లంకుంట ప్రాథమికోన్నత పాఠశాలకు గురువారం హరిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.80 వేలు విలువగల వాటర్ ప్లాంట్ అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం జ్యోతిలాల్ దాతలను అభినందించారు.

నేటి నుంచి సువార్త స్వస్థత సభలు

నాగర్‌కర్నూల్ క్రైం: ఈ నెల 14వ తేదీ నుంచి 16 వరకు జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆశీర్వాద, సువార్త స్వస్థత సభలను నిర్వహిస్తున్నట్లు నాగర్ కర్నూల్ జీసస్ హోప్ మినిస్ట్రీస్ పాస్టర్ టీ పాల్ రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కోయంబత్తూర్‌కు చెందిన హ్యారి గోమ్స్ హాజరవుతారని పేర్కొన్నారు.

తిరుమలలో భజన మండలి సభ్యులు



లింగాల: మండలంంంలోని అంబట్‌పల్లికి చెందిన రామాంజనేయ భజన మండలి సభ్యులు తిరుమల వేంకటేశ్వర స్వామి సన్నిధానంలో ఈ నెల 12 నుంచి రెండు రోజుల పాటు నిర్వహించిన భజన సంకీర్తనంలో పాల్గొన్నారు. తిరుమల అఖండ హరినామ సంకీర్తనంలో నిర్వహించిన భజనలో పాల్గొన్నట్లు భజన మండలి సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో భజన మండలి సభ్యులు వెంకటేషగౌడు, జంగయ్య, శ్రీశైలంగౌడు, రామకృష్ణ, చంద్రగౌడు, బాలరాజు, జస్వరాజు, అరవిందుగౌడు, నరేందర్, లక్ష్మణ్, శివ, రవి, హన్మంతిరెడ్డి, జగేష్, జానకి తదితరులు పాల్గొన్నారు.

నీరున్నా.. నిరుపయోగం



కుంగిపోయి నెర్రెలు బారిన చెరువుకట్ట

- ఆందోళన చెందుతున్న రైతులు

తెలకపల్లి: మండలంలోని గౌరారం గ్రామానికి సంబంధించిన పర్వతాపూర్, గౌరారం ఊర చెరువులో పుష్కలంగా నీరు ఉంటున్న పంటలు సాగు అవ్వడం లేదు. పర్వతాపురం చెరువు కింద దాదాపు 150 నుంచి 200 ఎకరాలలో రైతులు వరి పంటలు సాగు చేస్తారు. ప్రస్తుతం చెరువులో నీరు ఉన్నా నిరుపయోగంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గౌరారం ఊర చెరువుకు మరమ్మతు

80 సంవత్సరాల కిందట గౌరారం ఊర చెరువు తెగిపోతే ఆరేండ్ల కిందట మిషన్ కాకతీయ పథకం కింద మరమ్మతు పనులు చేపట్టారు. అయినా ఇప్పటి వరకు ఎలాంటి ప్రయోజనం లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ప్రభుత్వం హయాంలో మిషన్ కాకతీయ కింద ఏర్పాటు చేసిన చెరువుకు ఇప్పటి వరకు తూమును నిర్మించకపోవడంతో చెరువు కింద పంట పొలాలకు నీరు పారేందుకు కాల్వలు ఏర్పాటు చేయకపోవడంతో పంట పొలాలు ఎండుతున్నాయి. పర్వతాపూర్ ఊర చెరువులో చెరువు నిండితే గౌరారం ఊర చెరువుపైన సన్నచిన్నకారు రైతులు వరి పంట పండించుకునేవారు.

వృథాగా రెండు చెరువులు

పర్వతాపూర్, గౌరారం ఊరచెరువు కింద దాదాపు 400 ఎకరాలకు పైగా వరి పంటలు సాగు కావాల్సి ఉండగా ప్రస్తుతం పంటల సాగు చేయడం లేదు. వర్షపు నీటితో కేఎల్ఐ కాల్వల ద్వార రెండు చెరువులకు నీరు చేరి ప్రతి సంవత్సరం నిండుకుండలాగా చెరువులు తొలుకుతున్న రైతులు నిరాశ చెందుతున్నారు. అధికారులు చెరువు ఆయకట్టుకు నిర్మాణం చేపట్టకపోవడం, తూములు ఏర్పాటు చేయకపోవడంతో నీరు వృథాగా అవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



కాల్వలు లేక పొలాల్లో పెరిగిన కంపచెట్లు

ఏపుగా పెరిగిన కంపచెట్లు

చెరువుకట్టతోపాటు చెరువు కింద ఉన్న పంట పొలాల్లో కంప చెట్లు పెరిగాయి. అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధులు అలసత్యం వల్ల చెరువుల్లో కంపచెట్లు ఏపుగా పెరిగాయని ఆయా గ్రామాల రైతులు వాపోయారు. దీంతో సన్నచిన్నకారు రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ చెరువు కింద పంటలు పండితే చుట్టు గ్రామాలకు గింజలకు, పశుగ్రామానికి కొదవ లేకుండా ఉంటుంది. గౌరారం ఊరచెరువు కింద కాల్వలు నిర్మాణం చేసి నీరును అందించి పంటలు పండేవిధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

కాల్వలు ఏర్పాటు చేయాలి



గౌరారం ఊర చెరువు కింద కాల్వలు ఏర్పాటు చేయాలి. కాల్వల నిర్మాణం జరిగితే చెరువు కింద ఉన్న రైతులకు వరి పంటలు పండించుకోవడానికి అవకాశం ఉంది. ఆరు సంవత్సరాలుగా చెరువులో నీరు ఉన్న ఉపయోగం లేదు. కంప చెట్లు పెరగడంతో కోతులు, అడవి పందులకు నిలయంగా మారాయి. ఇప్పటికైన కాల్వల నిర్మాణం చేపట్టి సాగు నీరు అందించాలి.

– పొత్కుల ఆంజనేయులు రైతు గౌరారం

తూములు నిర్మించాలి



పర్వతాపూర్ ఊర చెరువుకు తూము ఉన్న తూములో రాళ్లతో పూడ్చివేశారు. చెరువు కట్టతో పోటీగా కంప చెట్లు పెరుగుతున్నాయి. నూతనంగా ఏర్పాటు చేసిన చెరువుకట్ట నుంచి నెర్రెలు పారి ప్రమాదభరితంగా మారాయి. వెంటనే చెరువుకు మరమ్మతు చేసి సాగు నీరు అందించాలి.

– ఏకాశి రైతు గౌరారం

నా దృష్టికి రాలేదు

గౌరారం ఊరచెరువు కింద సాగునీరు పారేందుకు కాల్వలు లేవని ఇప్పటి వరకు రైతులు నా దృష్టికి తీసుకురాలేదు. తూమును ఏర్పాటు కోసం అధికారులకు ప్రతిపాదనలు పంపిస్తాం. తూములతోపాటు చెరువు కింద పంటలకు నీరందించే కాల్వలు ఏర్పాటు చేసే విదంగా చర్యలు తీసుకుంటాం.

శ్రీకర్‌రెడ్డి, ఏఈ ఇరిగేషన్

సర్వే త్వరగా పూర్తి చేయాలి

తెలకపల్లి: మిషన్ భగీరథ నల్లా కనెక్షన్ల సర్వేను వెంటనే పూర్తి చేయలని ఎంపీడీఓ కృష్ణయ్య కోరారు. గురువారం మండలంలోని జంగమోనిపల్లి, గౌరెడ్డి పల్లి, గోలగుండం, గట్టునెల్లికుదురు గ్రామాలను ఆయన సందర్శించారు. సర్వే నమోదు వివరాలను కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. జంగమోని పల్లిలో అమ్మ ఆదర్శ పాఠశాలలను పూర్తి చేసిన పనులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం జంగమోనిపల్లి, గోలగుండం, గౌరెడ్డిపల్లి గ్రామాలలోని నర్సరీలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.



పాఠశాల పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణయ్య

ఘనంగా కుట్టు మిషన్ దినోత్సవం

కొల్లాపూర్: పట్టణంలో కుట్టుమిషన్ దినోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన టైలర్లను ఎస్‌ఎల్‌వీఆర్‌డీ సంస్థ నిర్వాహకులు కట్టా శ్రీనివాసులు శాలువాలు, పూల మాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టైలర్ల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. టైలర్లకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని, 50 సంవత్సరాలు పైబడ్డ టైలర్లకు నెలకు రూ.6 వేల పింఛన్ చెల్లించాలని, ఉపాధికోసం ఎటువంటి పూచీకత్తులు లేకుండా రూ.5 లక్షల మేరకు రుణాలు అందించాలన్నారు. కార్యక్రమంలో టైలర్లు వెంకటస్వామి, మధు, చిలక వెంకటస్వామిగౌడ్, సాగర్, దినేష్, పాషా తదితరులున్నారు.



మాట్లాడుతున్న కట్టా శ్రీనివాసులు

రైస్ మిల్లులను తనిఖీ చేసిన తహసీల్దార్



వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న రైస్ మిల్లులను గురువారం తహసీల్దార్ రవికుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిల్లుల యాజమానులు సకాలంలో బియ్యాన్ని తయారు చేసి స్టాక్ పాయింట్‌కు అందించాలని సూచించారు. యాసంగి సంబంధించిన వరిధాన్యం నిల్వలను పరిశీలించారు. అనంతరం కుప్పగండ్ల వద్ద ఉన్న రైస్ మిల్లులోని వరిధాన్యం నిల్వలు, రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ శంకర్, సిబ్బంది, మిల్లుల యజమానులు తదితరులు ఉన్నారు.

రైతు శ్రేయస్సే లక్ష్యం



కల్వకుర్తి రూరల్: రైతు శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తున్నామని పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్దన్‌రెడ్డి అన్నారు. గురువారం కల్వకుర్తి పీఏసీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కల్వకుర్తి, ఊరుకొండ మండలాల పరిధిలో ఏర్పాటు చేసిన కేంద్రాల వద్ద 1386 మంది రైతుల నుంచి 97 వేల క్వింటాళ్ల వరిధాన్యం కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. గోదాంలో యూరియా 937 బస్తాలు నిల్వ ఉందని, 28 బస్తాల కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. 20–20 రకం ఎరువులు 560 బస్తాలు అందుబాటులో ఉన్నాయని ఒక్కొక్క బస్తా రూ.1130లకు విక్రయిస్తునట్లు పేర్కొన్నారు. బంగారు ఆభరణాలపై రుణాలు, లాకర్ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ శ్యాం, డైరెక్టర్‌లు రామునాయక్, వెంకటయ్య, సీఈఓ వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కళాకారులకు సన్మానం

తాడూరు: మండలంలోని పాపగల్ గ్రామానికి చెందిన డప్పు రవి, పలు గ్రామాలకు చెందిన కళాకారులను జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ సన్మానించారు. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు హాజరయ్యారు. మండల కళాకారులను సన్మానించడం సంతోషంగా ఉందన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

కొల్లాపూర్: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కొల్లాపూర్ ఎస్ఐ హృషికేష్ హెచ్చరించారు. గురువారం ఆయన వ్యవసాయ శాఖ ఏడీఏ రవితో కలిసి పట్టణంలోని ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. దుకాణాల్లో విక్రయిస్తున్న విత్తనాలను వారు పరిశీలించారు. స్టాక్ రికార్డులు, బిల్లులకు సంబంధించిన రికార్డులు సరిచూశారు. నాణ్యమైన, గుర్తింపు ఉన్న విత్తనాలను మాత్రమే విక్రయించాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం విక్రయాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు ఉన్నారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని గాయత్రి ఏజెన్సీ, చాముండేశ్వరి రైతు సేవా కేంద్రం, లక్ష్మీనర్సింహ ట్రేడర్స్ దుకాణాలను గురువారం వ్యవసాయ అధికారి రమేష్, పెంట్లవెల్లి ఎస్ఐ రామన్‌గౌడ్‌లు తనిఖీ చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని డీలర్లను హెచ్చరించారు. వారి వెంట సిబ్బంది, డీలర్లు ఉన్నారు.



దుకాణాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ, ఏడీఏ

గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకోవాలి

కల్వకుర్తిరూరల్: గృహజ్యోతి పథకానికి అర్హత కలిగిన ప్రతి ఒక్కరు మరోసారి దరఖాస్తులు చేసుకోవాలని కల్వకుర్తి విద్యుత్ ఏఈ శ్రీనివాస్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జూన్ నెలలో గృహజ్యోతి పథకానికి సంబంధించిన జీరో బిల్లులు దాదాపు 6 వేల కుటుంబాలకు ఇచ్చామని పేర్కొన్నారు. మండలంలో టౌన్ మండలం మొత్తం 18 వేల కనెక్షన్ కలిగి ఉన్నాయని వివరించారు. మున్సిపాలిటి పరిధిలో ఉన్న విద్యుత్ వినియోగదారులు మున్సిపల్ కార్యాలయంలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన వినియోగదారులు మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, విద్యుత్ బిల్లుతోపాటు ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వివరాలను పొందుపరిచి మరోసారి దరఖాస్తు చేసుకుంటే గృహజ్యోతి పథకాన్ని అమలు చేస్తామని పేర్కొన్నారు.

సారా స్వాధీనం: ఇద్దరిపై కేసు నమోదు

మన్ననూర్: అమ్రాబాద్ మండలం మన్ననూర్, కొత్తపల్లి గ్రామాలలో గురువారం ఎస్‌హెచ్ఓ అచ్చంపేట, స్టేట్ టాస్క్‌ఫోర్స్ (ఎస్‌టీఎఫ్) అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో దాడులు నిర్వహించినట్లు అచ్చంపేట ఎక్సైజ్ ఎస్ఐ సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో సారా తయారీదారుల ఇళ్లలో సోదాలు నిర్వహించి 15 లీటర్ల సారాతో పాటూ 400 లీటర్ల వరకు బెల్లం ఊటను ధ్వంసం చేశారు. కొత్తపల్లిలో ఓ వ్యక్తి పరారీలో ఉండగా మన్ననూర్‌లోని ఉమామహేశ్వర కాలనీకి చెందిన విస్లావత్ బుజ్జిపై కేసు నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో ఎస్‌టీఎఫ్ సీఐ శ్రీధర్, ఎస్‌హెచ్ఓ సీఐ కృష్ణయ్య సిబ్బంది పాల్గొన్నారు.



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న అధికారులు

లక్కీడిప్ ద్వారా విద్యార్థుల ఎంపిక

మన్ననూర్: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం లక్కీడిప్ ద్వారా విద్యార్థులను ఎంపిక చేశారు. గురువారం బెస్ట్ అవైలేబుల్ స్కూళ్ల ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను స్థానిక రైతు వేదిక ప్రాంగణంలో డీఎఫ్ఓ, ఐటీడీఏ ఇన్‌చార్జ్ పీఓ రోహిత్ రెడ్డి విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని వివిధ మండలాలకు చెందిన 309 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. చెంచు విద్యార్థులకు ప్రత్యేకంగా 3వ తరగతిలో 1 సీటు, 5వ తరగతిలో ఒక సీటు, ఏజెన్సీ విద్యార్థులకు ప్రత్యేకంగా 2 సీట్లకు గానూ (చెంచు, లంబాడ, ఎరుకల) 3వ తరగతిలో 1 సీటు, 5వ తరగతిలో 1 సీటు కేటాయించారు. అదేవిధంగా మైదాన ప్రాంతంలోని అన్ని తెగల(గిరిజన) విద్యార్థులకు గానూ 3వ తరగతిలో 8 సీట్లు, 5వ తరగతిలో 4 సీట్లు, 8వ తరగతిలో 4 సీట్లు ఈ క్రమంలో మొత్తం 16 సీట్లకు ఎంపీక చేశారు. కార్యక్రమంలో డీటీడీఓ కమలాకర్‌రెడ్డి, ఏఓ పద్మ, ఏటీడీఓ శంకర్, హెచ్‌ఎంలు తిరుపతయ్య, ఉమాదేవి, ఐటీడీఏ సిబ్బంది జమీల్, రవి, శంకర్, అయోధ్య తదితరులు పాల్గొన్నారు.



ఐటీడీఏ పీఓ సమక్షంలో లక్కీ డిప్ తీస్తున్న అధికారులు

ఉపాధ్యాయుల బదిలీ

ఉప్పునుంతల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు గురువారం బదిలీపై వెళ్లారు. ఉపాధ్యాయుడు హన్మంత్ రెడ్డి జెడ్పీహెచ్‌ఎస్ ఉర్దూ మీడియం అమ్రాబాద్‌కు బదిలీకాగా, లక్ష్మారావు బాలికల జెడ్పీహెచ్‌ఎస్ అమ్రాబాద్‌కు బదిలీ అయ్యారు. బదిలీపై వెళ్లిన ఇరువురు ఉపాధ్యాయులు ఆరేళ్లుగా ఉప్పునుంతల జెడ్పీహెచ్‌ఎస్‌లో విధులు నిర్వర్తించారు. గెజిటెడ్ హెచ్‌ఎం పదోన్నతి రావడంపై ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేశారు.

లింగాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎంగా బషీర్ అహ్మద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. అదే విధంగా మండల పరిధిలోని అంబట్‌పల్లి జిల్లా పరిషత్ పాఠశాల జీహెచ్‌ఎంగా హైదరాబాద్ చంపాపేట ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న కె.జ్యోతిరాణి బదిలీపై వచ్చారు.

తాడూరు: మండల కేంద్రంలోని ఆయా ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎంలుగా గురువారం బాధ్యతలు చేపట్టారు. మండలంలోని బలాన్‌పల్లి పాఠశాలకు పరమేష్‌ప్రసాద్, శిర్సవాడ రమేష్, మేడిపూర్‌కు త్యాగరాజుగౌడ్, ఐతోల్‌కు భాస్కర్‌రెడ్డి బదిలీపై వచ్చారు. ఆయా పాఠశాలలో వారిని ఉపాధ్యాయులను సన్మానం చేశారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ



కోడేరు: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా ప్రభుత్వం సరఫరా చేసిన దుస్తులను గురువారం ఐకేపీ ఏపీఎం పార్వతమ్మ అందజేశారు. ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. హెచ్‌ఎం కృష్ణయ్య, కవిత, అలివేల, తదితరులు పాల్గొన్నారు.

తాడూరు మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం ఎంఈఓ భాస్కర్‌రెడ్డి పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలల మరమ్మతు కోసం ప్రతి పాఠశాలకు రూ.25 వేలు మంజూరయ్యాయన్నారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.

13ఎన్‌జికెఎల్401 గోవిందాయి పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



చారకొండ: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం కలుగుతుందని ప్రత్యేక అధికారి ఏఓ చిన్న హుస్సేన్ అన్నారు. మండలంలోని మర్రిపల్లిలో గురువారం పంచాయతీ కార్యదర్శి రవిశంకర్‌తో కలిసి గ్రామంలో పర్యటించారు. పారిశుద్ధ్యానికి తీసుకుంటున్న చర్యల గురించి కార్యదర్శిని అడిగి తెలుసుకున్నారు. విషజ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులకు సూచించారు. సమావేశంలో గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

దేవాలయ భూమి సర్వే



చారకొండ: కొన్ని నెలలుగా శిర్సనగండ్ల సీతారామ చంద్ర స్వామిదేవాలయం భూమిలో కొందరు అక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. దేవాలయ చైర్మన్ దేరం రామశర్మ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం దేవాలయం స్థలం సంబంధిత సర్వే 327,328 నంబర్‌లో సర్వే చేశారు. దేవాలయం భూమికి సబంధిత హద్దులను సరి చూశారు. 33 మంది అక్రమంగా ఇళ్ల నిర్మించుకునట్లు గుర్తించారు. అక్రమ నిర్మాణాలు చేపట్టిన వారికి త్వరలో నోటీసులు అందిస్తామని ఆలయ చైర్మన్ పేర్కొన్నారు.

కేసు నమోదు

లింగాల: మండలంలోని అప్పాయపల్లికి చెందిన వివాహిత శ్వేత(26) బుధవారం ఆత్మహత్య చేసుకున్న ఘటనపై గురవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్‌మోహన్ తెలిపారు. మృతురాలి తండ్రి నిరంజన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

విద్యార్థులతో పుస్తకాలు మోయించిన ఉపాధ్యాయులు

పెద్దకొత్తపల్లి: ప్రభుత్వ పాఠశాలలు తెరిచి రెండవ రోజున ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసేందుకు ఎంఈఓ కార్యాలయం నుంచి పాఠశాలలకు సరఫరా చేస్తున్నది. ఉపాధ్యాయులు విద్యార్థులతో పాఠ్య పుస్తకాలు మోయించి తీసుకెళ్లారు. గురువారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనం నుంచి 20 పాఠశాలలకు సంబంధించిన ఉపాధ్యాయులు పాఠ్య పుస్తకాలను తీసుకెళ్లారు. కల్వకోల్ ప్రాథమిక పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు విద్యార్థులతో పాఠ్య పుస్తకాలను మోయించి ఎమ్మార్సీ భవనం నుంచి ఆటోలో తరలించారు. ఎంఈఓ చంద్రుడిని వివరణ కోరగా సంబంధిత పాఠశాల ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



ఎమ్మార్సీ భవనం వద్ద పుస్తకాలు తీసుకొస్తున్న విద్యార్థులు

తహసీల్దార్‌కు వినతి



పెంట్లవెల్లి: పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ గురువారం ప్రజా సంఘాల పోరాట ఐక్య వేదిక ఆధ్వర్యంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ తహసీల్దార్ హిమబిందుకు వినతిపత్రం ఇచ్చారు. మండల కేంద్రంలోని సర్వే నెంబర్ 22, 27లో ఉన్న 14 ఎకరాల 36 కుంటల భూమిని పేదలకు పంచాలని కోరారు. కార్యక్రమంలో హనుమంతు, స్వామి, గోపాల్, రాజు, గోవిందమ్మ, వెంకటమ్మ, లావణ్యలు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం

పెంట్లవెల్లి: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ ఉమామహేశ్వరి అన్నారు. గురువారం మండల కేంద్రలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఆయా గ్రామాల ఎంపీటీసీలు సభ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని అధికారులను కోరారు. విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హిమబిందు, వైస్ ఎంపీపీ బీంరెడ్డి, ఎంపీడీఓ ప్రసన్నకుమార్, సింగిల్‌విండో చైర్మన్ విజయరామారావు, జిల్లా కో ఆప్షన్ మెంబర్ మతీన్, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

సొంత భవనాలు నిర్మించాలి



కొల్లాపూర్: ప్రభుత్వ గురుకుల విద్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలని బీఎస్‌ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి బి.దాస్, బీఆర్‌ఎస్‌వీ జిల్లా నాయకుడు శేఖర్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని రంగదాసు వీధిలో గల బీసీ బాలుర గురుకుల పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు ఏర్పాటు చేసిన వసతి, సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ గురుకుల పాఠశాలను అద్దె భవనంలో కొనసాగిస్తుండడంతో విద్యార్థులకు సరైన మౌలిక సదుపాయాలు అందుబాటులో లేవన్నారు. విద్యారంగానికి పెద్దపీట వేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెబుతున్న మాటలకు, వాస్తవాలకు పొంతన లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గురుకులాకు స్వంత భవనాలు నిర్మించాలని వారు కోరారు.